## షటిల్ లో సత్తా చాటిన గడ్డం కేశవమూర్తి
- ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం




8లో..


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 162
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
మార్చి 24, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


- పెద్ద మొత్తంలో బంగారం, వెండి మాయం
- మెట్టు రామలింగేశ్వరాలయంలో ఇష్టారాజ్యం
- ప్రధాన పూజారి, ఈఓ కుమ్మక్కు
- భక్తులు ఇచ్చే డబ్బులు నేరుగా పూజారి అకౌంట్ లోకే
- విచారణ జరిపించాలంటూ రాష్ట్రీయ హిందూ పరిషత్ డిమాండ్





# దేవుడి సొమ్ము.. దోచేశారు!



దక్షిణ కాశిగా పిలువబడే మెట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రధాన పూజారి, ఈఓ కుమ్మక్కై దేవుడి సొమ్మునే దోచేస్తున్నారు. భక్తులు సమర్పించిన బంగారం, వెండిని కాజేస్తూ తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అదే విధంగా వివిధ సేవలకోసం భక్తులు ఇచ్చే సొమ్మును ప్రధాన పూజారి నేరుగా తన బ్యాంక్ అకౌంట్ లోనే జమ చేసుకోవడం వివాదాలకు కారణమవుతోంది. హనుమకొండ జిల్లా మడికొండలోని మెట్టుగుట్టపై స్వయంభుగా వెలసిన రామలింగేశ్వర స్వామికి శతాబ్దాల చరిత్ర ఉంది. శివకేశవుల మధ్య అభేద్యాన్ని చాటిచెప్పిన పుణ్యక్షేత్రం మెట్టుగుట్ట. ఇక్కడి విగ్రహ స్వరూపం కాశీలోని విశ్వేశ్వరుడిని పోలి ఉండడంతోపాటు స్వామి వారికి క్షేత్రపాలకుడిగా వీరభద్ర స్వామి కొలువై ఉన్నాడు. ఇంతటి ప్రాశస్తం కలిగిన ఆలయంలో తమ ఇష్టానుసారంగా మార్పులు, చేర్పులు చేస్తూ స్వామివారికే అపచారం చేస్తున్నారు. వీరభద్ర స్వామివారి ప్రతిరూపం భిన్నంగా ఉందని భావించిన ఆలయ ప్రధాన పూజారి ఎవరికి చెప్పకుండా దానిని తొలగించి కాళేశ్వరంలోని గోదావరిలో నిమజ్జనం చేయడంపై రాష్ట్రీయ హిందూ పరిషత్ నేతలు మండిపడుతున్నారు. అలాగే మెట్టుగుట్టపై జరుగుతున్న అవినీతి, అక్రమాలపై దేవాదాయ శాఖ అధికారులు విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. - వరంగల్ వాయిస్, హనుమకొండ

వివరాలు 2లో..

రోడ్డు ప్రమాదంలో..
## ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
- కాంటాయపాలెంలో విషాద చాయలు



2లో..



2లో..

## ఘనంగా బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం
- ఉదయం హోమాలు..
- మధ్యాహ్నం మహాన్నదానం
- ఖర్చుల బుక్ లెట్ ఆవిష్కరణ

## క్షయ నిర్మూలనకు చర్యలు
- కలెక్టర్ పి.ప్రావీణ్య
- ఘనంగా క్షయ వ్యాధి దినోత్సవం



8లో..

# దేవుడి సొమ్ము దోచేశారు!



- పెద్ద మొత్తంలో బంగారం, వెండి మాయం
- మెట్టు రామలింగేశ్వరాలయంలో ఇష్టారాజ్యం
- ప్రధాన పూజారి, ఈఓ కుమ్మక్కు
- భక్తులు ఇచ్చే డబ్బులు నేరుగా పూజారి అకౌంట్ లోకే
- విచారణ జరిపించాలంటూ రాష్ట్రీయ హిందూ పరిషత్ డిమాండ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శివకేశవుల మధ్య అభేద్యాన్ని చాటిచెప్పిన పుణ్యక్షేత్రం మెట్టుగుట్ట. ఇక్కడ శివాలయం, రామాలయం ఎదురెదురుగా ఉంటాయి. మహాలింగం కాశీలోని విశ్వేశ్వరుడిని పోలి ఉంటుంది. గుట్ట మీద నేత్రాకారంలో ఉన్న గుండంలోని నీళ్లు సాక్షాత్తూ కాశీలోని గంగాజలమేనని భక్తుల నమ్మకం. కాబట్టే ఈ క్షేత్రానికి 'దక్షిణ కాశీ'గా పేరొచ్చింది. హనుమకొండ జిల్లా మడికొండ ప్రాంతంలో కాజీపేట రైల్వే జంక్షన్ కు రెండు కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. సీతారామచంద్రులు భద్రాచల ప్రాంతంలో సంచరించిన సమయంలో...మెట్టుగుట్ట క్షేత్రానికి వచ్చి శివుడిని అర్చించినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. అందుకే మెట్టు రామలింగేశ్వరాలయమన్న పేరు వచ్చింది. ఇక్కడున్న రామాలయమూ అంతే ప్రాచీనమైంది.

### ప్రధాన పూజారి, ఈఓ ఇష్టారాజ్యం..

మెట్టు రామలింగేశ్వరాలయంలో ఆలయ ప్రధాన పూజారి రాగిచెడు అభిలాష్ శర్మ, కార్యనిర్వహణాధికారి శేషు భారతీ కుమ్మక్కై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రాష్ట్రీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్ ఆరోపించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయంలో ఇష్టానుసారంగా చేర్పులు, మార్పులు చేస్తే భగవంతుడికే అపచారం చేస్తున్నారని మండిపడ్డారు. స్వామి వారికి క్షేత్ర పాలకుడిగా ఉన్న వీరభద్ర స్వామి ప్రతిరూపం భిన్నంగా ఉందని భావించిన పూజారి స్వామి వారినే కనిపించకుండా చేశాడన్నారు. అదే విధంగా గర్భగుడిలో రెండు శివలింగాలు ఉంటే స్వయంభుగా వెలసిన శివలింగాని ఉంచి మరో శివలింగాన్ని తొలగించాడరి ఆరోపించారు. అదే విధంగా పర్వతి అమ్మవారిని కూడా అక్కడినుంచి తీసి వేశారన్నారు. భక్తులకు, అధికారులకు తెలియకుండా ఇష్టానుసారంగా మార్పులు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### 30 కిలోల వెండి మాయం..

వివిధ వస్తువుల తయారీ కోసం 30 కిలోల వెండి బయటే ఉన్నదని, ఈ విషయం ఈఓ శేషు భారతికి కూడా తెలుసంటూ ప్రధాన పూజారి గతంలోనే ఒక లేఖ సమర్పించారని మండల భూపాల్ వెల్లడించారు. అయితే ఇప్పటి వరకు ఆ 30 కిలోల వెండి లెక్కల్లోకి రాలేదని ఆరోపించారు. దీనిని సొంతానికి వాడుకొని ఉంటాడని భావిస్తున్నామన్నారు. అదే విధంగా భక్తులు సమర్పించే డబ్బులను నేరుగా తన ఖాతాలోకి జమ చేసుకోవడంతోపాటు బంగారం, వెండిని కూడా అధికారులకు లెక్క చెప్పకుండా తానే వాడుకుంటున్నట్లు విమర్శించారు.

### డీసీపై కుట్ర..

మెట్టు గుట్టపై జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని దేవాదాయ శాఖ అధికారులకు విన్నవించుకోగా డీసీ శ్రీకాంత్ రావు స్పందించారని భూపాల్ వెల్లడించారు. ఈ మేరకు డీసీ విచారణ నిర్వహించారని పేర్కొన్నారు. ఆలయ ప్రధాన పూజారి రాగిచెడు అభిలాష్ శర్మ 15 కిలోల వెండిని దేవాలయానికి సమర్పించకుండా తన దగ్గరే పెట్టుకున్నాడని, భక్తులు సమర్పించే డబ్బులను కూడా నేరుగా తనే తీసుకుంటున్నాడంటూ విచారణలో తేల్చి చెప్పారు. ఈ మేరకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫైల్ కూడా పంపించారు. దీంతో ఇక తమపై శాఖాపరమైన చర్యలు తప్పవని భావించిన అర్చకులు, ఈఓ రాజకీయ ఒత్తిడి తీసుకొచ్చి డీసీని బదిలీ వేడు వేశారనిఆరోపించారు. ఆయన బదిలీ కావడంతో అక్రమాల ఫైల్ అటకెక్కించారన్నారు.

### 5 లేదా 6 లక్షల కండువాలే కొన్నాం..

**- శేషు భారతి, ఈఓ**



ప్రసిద్ధి గాంచిన భద్రకాళి దేవస్థానంలో ప్రతి ఏడు నాలుగు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. వీటిలో పాల్గొనే ముఖ్యులకోసం ఈ టెండర్ ద్వారానే కండువాలు కొనుగోలు చేస్తున్నాం. అత్యవసర పరిస్థితిలో కావాలనుకుంటేనే శాలువాలు, కండువాలు కొనుగోలు చేస్తున్నాం. వారు ఆరోపించినట్లు 90 లక్షల కండువాలు కొనుగోలు చేసినట్లు వస్తున్న వార్తలో వాస్తవం లేదు.

### స్తపతి సూచనల మేరకే మార్పు..

**- అభిలాష్ శర్మ, ప్రధాన అర్చకులు**



గర్భాలయంలో రెండు లింగాలు ఉండాకూడదన్న స్తపతి సూచనల మేరకే స్వయంభు లింగాన్ని ఉంచి ప్రతిష్ఠ చేసిన శివలింగాన్ని తొలగించాం. అదే విధంగా అమ్మవారిని కూడా తొలగించాం. వీరభద్ర స్వామి భిన్నంగా ఉన్నందున అది పూజకు పనికిరాదని చెప్పినందునే దానిని కూడా తొలగించాం. ఈఓ గారితోపాటు దాతలకు చెప్పే పాత వెండిని కరిగించి దానికి కొత్తగా వచ్చిన వెండిని కలిపి స్వామి వారికి నాగాభరణం, కవచం, ఆభరణాలు చేయించాం.





### చర్యలు తీసుకోవాలి..

మెట్టు రామ లింగేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు అర్చకుడు అభిలాష్ శర్మ, ఈఓ శేషు భారతిని భాద్యులుగా చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్ కోరారు. లేకుంటే ప్రజలను చైతన్య వతం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ చీకటి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి సుజాత, వరంగల్ జిల్లా అధ్యక్షులు మడిపెల్లి నాగరాజు గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు సంతోష్, ఉమ్మడి వంగల్ జిల్లా దేవాలయ పరిరక్షణ సమితి కన్వీనర్ అశోక్, జనరల్ సెక్రటరీ బజార్ హన్మంత్ శర్మ, రాంగోవింద్, రణధీర్ రెడ్డి, నీరటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి ప్రధమ వార్షికోత్సవం

- ఉదయం హోమాలు..
- మధ్యాహ్నం మహాన్నదానం
- ఖర్చుల బుక్ లెట్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అండర్ రైల్వే గేటు ప్రాంతంలోని 32వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోటలో బొడ్రాయి ప్రధమ వార్షికోత్సవాన్ని ఆది, సోమ వారాల్లో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి శ్రీ మహాగణాధిపతి పూజ, పుణ్యాహవాచనం, మాతృకా పూజలు, అఖండ దీప స్థాపన, అంకురార్పణ, వాస్తు, యోగిని భద్ర మండలాది గ్రహమండల పూజలు, పరివార దేవత హోమాలు నిర్వహించారు. ఉదయం 9గంటలనుంచి సాయంత్రం 6 గంటల వరకు జలాభిషేకం అనంతరం తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రాతరౌపాసనము, యాగమండవ పూజలు నిర్వహించారు. అనంతరం బొడ్రాయి శ్రీ లక్ష్మి, భూలక్ష్మి అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు, అలంకరణలు, వార్షికోత్సవ పూజ, మహా నివేదన, పూర్ణాహుతి, ఆశీర్వచనం, మంత్రపుష్ప, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్నదాన వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమంలో ప్రజల నుంచి సేకరించిన విరాళాలు, ఖర్చులకు సంబంధించిన వివరాలతో కూడిన పుస్తకాన్ని 32, 33 డివిజన్ల కార్పొరేటర్లు పల్లం పద్మా రవి, ముష్కమళ్ళ అరుణ సుధాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి కమిటీ అధ్యక్షులు తాటిపాముల భిక్షపతి, ప్రధాన కార్యదర్శి చిలువేరు రవీందర్, ఉపాధ్యక్షులు పరదేశి రాజేష్, బొల్లం మధు, గౌరవ సలహాదారు ఊరుగొండ శంకర్, కోశాధికారి బండారి పూర్ణచందర్ తోపాటు బొడ్రాయి కమిటీ ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఆర్గనైజర్లు సభ్యులందరి సమయంలో రెండు రోజుల పాటు కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించారు.



## రోడ్డు ప్రమాదంలో..

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
- కాంటాయపాలెంలో విషాద చాయలు

**వరంగల్ వాయిస్, తొర్రూరు:** సూర్యాపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తొర్రూరు మండలం కాంటాయపాలెం గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డం రవీందర్ హైదారాబాద్ లో కార్ డ్రైవర్ గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం తన భార్య రేణుక తల్లిగారి గ్రామమైన కోటపహాడ్ గ్రామం ఆత్మకూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చి హైదారాబాద్ కు వెళ్తుండగా బీబీపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులతోపాటు వారి కూతురు రిషిత అక్కడికక్కడే మరణించారు. ఓవర్ టేక్ చేసే క్రమంలో వీరు ప్రయాణిస్తున్న కారుకు ఎదురుగా వస్తున్న బస్ ఢీ కొనడంతో ప్రమాద స్థలిలోనే ఈ ముగ్గురు మరణించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా సోమవారం మృతుడి స్వగ్రామం కాంటాయపాలెంలో బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, మార్చి 24, 2025

# గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు సమగ్ర చర్యలు

## ■ మండల ప్రత్యేక అధికారి విజయ భాస్కర్



**వరంగల్ వాయిస్, పరకాల :** మండల పరిధిలో రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దడి సమస్య రాకుండా సమర్థమైన నివారణ చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కె. విజయ భాస్కర్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారులతో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ భాస్కర్ మాట్లాడుతూ, రానున్న వేసవిలో తీవ్రమైన ఎండల కారణంగా నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున, గ్రామాల్లోని అన్ని పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు మాట్లాడుతూ, బోర్లు చెడిపోయినా లేదా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా, ముందుగా సమాచారం అందిస్తే సంబంధిత పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ మధు కుమార్, పంచాయతీ రాజ్ డిప్యూటీ ఈఈ జయశంకర్, విద్యుత్ శాఖ ఏఈ, మండలంలోని అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులను పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ సోమవారం అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో (స్థానిక సంస్థలు), కె. వీర బ్రహ్మాచారి (రెవెన్యూ) లతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సమీక్షించి, పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మొత్తం 84 దరఖాస్తులు అందాయి. వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తూ, పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులకు తాము పర్యవేక్షిస్తున్న వసతి గృహాలలో డైట్ మెనూ, శానిటేషన్, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల స్థితిగతులు వంటి అంశాలను పరిశీలించాలని సూచించారు.

## ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి..

ప్రభుత్వ కార్యాలయాలు, ఉద్యోగుల గృహాలలో ప్లాస్టిక్ రహిత వాతావరణాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్ లాబీలో డీఆర్డీఓ, మెప్మా మహిళా స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేసిన స్టీల్ వాటర్ బాటిల్స్, జ్యూట్ బ్యాగులు, చేనేత వస్త్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో పురుషోత్తం, డీసీఓ వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహస్వామి, డీపీఓ హరిప్రసాద్, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లా నాయక్, డీవీహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశి రామ్ నాయక్, డీఎస్ఓ ప్రేమ్ కుమార్, డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, డీడబ్ల్యూఓ ధనమ్మ, జీఎం ఇండస్ట్రీస్ శ్రీమన్నారాయణ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# సీతారాములను దర్శించుకున్న ఏఎంసీ చైర్‌పర్సన్ దంపతులు



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** అపర భద్రాదిగా పేరుగాంచిన ఇల్లంతకుంట శ్రీ శ్రీ సీతారామచంద్ర స్వాములను జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం తన భర్తతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి దంపతులను ఆశీర్వదించారు. అనంతరం చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలోని జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక, కమలాపూర్, హుజురాబాద్, శంకరపట్నం, ఓదెల, కాల్వ శ్రీరాంపూర్, టేకుమట్ల, మొగుళ్లపల్లి, చిట్యాల, పరకాల మండలాల రైతులకు శ్రీ సీతారామచంద్ర స్వాముల వారి ఆశీర్వాదం ఎల్లప్పుడూ కలగాలని ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని, రైతులు మరియు వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి సుధాకర్, చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందంలను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు, వావిలాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వానరాశి జాన్, నాంపల్లి రవీందర్, రామంచ స్వామి, చిట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# లూనావత్ బొజ్జ్య నాయక్‌కు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** జనగామ జిల్లా ప్రధాన కూడలిలో సోమవారం, అంబేద్కర్ విగ్రహం వద్ద, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన మలిదశ ఉద్యమకారుడు లూనావత్ బొజ్జ్య నాయక్ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం సేవాలాల్ సేన జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. బొజ్జ్య నాయక్ తల్లి మంకితి చేతుల మీదుగా, సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ మహేందర్, జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్ నాయక్, రఘునాథపల్లి మండల అధ్యక్షుడు బానోతు విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి దరవత్ రమేష్ నాయక్ తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం, జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ, బొజ్జ్య నాయక్ తన ప్రాణాలను అర్పించి, ప్రభుత్వాన్ని తెలంగాణ సాధన దిశగా కదిలించే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. తనపై పెట్రోల్ పోసుకుని, "జై తెలంగాణ" నినాదంతో ఆత్మబలిదానం చేసిన ఈ మహనీయుని త్యాగం మరవలేనిదన్నారు. అయితే, 13 సంవత్సరాలు గడిచినా బొజ్జ్య నాయక్ త్యాగానికి గౌరవ సూచికంగా ఓ స్మారక స్థూపం ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా, ఆయన అమరత్వాన్ని స్మరించేందుకు ప్రముఖ ప్రదేశాలకు ఆయన పేరును కలిపి నామకరణం చేయాలని, అలాగే నియోజకవర్గంలో ఆయన పేరుతో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు అంకితం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నర్మెట మండల ఉపాధ్యక్షుడు బానోత్ సుమన్, రఘునాథపల్లి మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ లూనావత్ మల్లేష్, గిరిజన మండల నాయకుడు మలియా నాయక్, యాపలగడ్డ మాజీ సర్పంచ్ సక్రు నాయక్, తండా పెద్దమనుషులు బిక్షపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్ర



**వరంగల్ వాయిస్, పరకాల:** నియోజకవర్గంలో తెలంగాణ ఉద్యమకారుల చైతన్య ర్యాలీ ఇమ్మడిశెట్టి రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చీమ శ్రీనివాస్ పాల్గొని ఉద్యమకారులకు స్వాగతం పలికారు. అంబేద్కర్ సెంటర్ నుంచి అమరధామం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా, ప్రతి ఉద్యమకారుడికి ఉద్యోగం, 250 గజాల భూమి, రూ. 25,000 పెన్షన్ అందించాలని ఆయన కోరారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రకటన చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే, తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డు జారీ చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ నేతలు ఇమ్మడిశెట్టి రవీందర్, పోలిశెట్టి వరంగల్ జిల్లా కన్వీనర్ దామెర మొగిలి, ఆలేటి రవీందర్, బస్సుల సంజీవయ్య, బొచ్చు కుమార్, గజ్జి శంకర్, పల్లబోయిన సారయ్య, ఏలి నరసింహారావు, ఆరే సాంబ రెడ్డి, గిద్దలూరు రామన్న, చల్లా శ్రీనివాస్ రెడ్డి, రంగు మహేందర్, ఎండి రఫీ, ఆడ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్న ప్రాసన కార్యక్రమంలో పుల్లూరి స్వప్న-సదానందం



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు–స్వప్న దంపతుల కూతురు చిన్నారి శ్రీ అభిజ్ఞారాం అన్న ప్రాసన కార్యక్రమం సోమవారం అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లంతకుంట శ్రీ సీతారామచంద్ర స్వాముల వారి దేవస్థానంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న–సదానందంలు హాజరై అంబాల రాజు–స్వప్న దంపతులను, కూతురు శ్రీ అభిజ్ఞ రామ్, కుమారుడు అభిమన్యు రామ్ లను ఆశీర్వదించారు. ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వాముల వారి ఆశీర్వాదం వారి కుటుంబానికి ఎల్లవేళలా ఉండాలని కోరారు. అనంతరం అంబాల రాజు–స్వప్న దంపతులు జమ్మికుంట ఏఎంసీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందంలను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వావిలాల గ్రామ శాఖ అధ్యక్షులు వానరాశి జాన్, నాంపల్లి రవీందర్ రామంచ స్వామి, సట్ల రాజు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి సామాజిక సేవ శిక్ష

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఏసీపీ టి.సత్యనారాయణ పర్యవేక్షణలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన(30) మంది వ్యక్తులను, మేజిస్ట్రేట్ అబ్బోజు వేంకటేశంఎదుట హాజరు పరిచినట్లు వరంగల్ ట్రాఫిక్ పోలీసలు తెలిపారు. ఈ క్రమంలో ఆర్1 భూమా లక్ష్మణ్ కు రూ.800 జరిమానా, ఒక రోజు సామాజిక సేవా శిక్ష, ఆర్ 2 సయ్యద్ సబీర్ పాషాకు రూ.2500 జరిమానా, మూడు రోజుల సామాజిక సేవా శిక్ష, ఆర్3 తొగరు రాజుకు రూ.1000 జరిమానా, రెండు రోజుల సామాజిక సేవ శిక్ష, ఆర్ 4 ధరావత్ దేవసింగ్ కు మూడు రోజుల సామాజిక సేవ శిక్ష పడగా, ఆర్1 to ఆర్ 4లను ప్రొఫెసర్ వెటర్నరీ హాస్పిటల్ ఎంజీఎం వద్దకు పంపి, మిగతా (26) మంది వ్యక్తులకు రూ.27,700రూపాయల జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు.

## సైకిళ్లపై దేశ పర్యటన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వాహన కాలుష్యం పై అవగాహన కల్పించేందుకు కొత్తగూడెం యువకులు పండు రాథోడ్, రాజు సైకిళ్లపై దేశ పర్యటనకు బయలుదేరారు. ఖమ్మం నుంచి బయలుదేరి సోమవారం ఉదయం వరంగల్ లోని ఖిలా వరంగల్ కోట, శ్రీ భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని, హనుమకొండలోని ప్రముఖ చారిత్రాత్మకమైన వేయి స్తంభాల గుడికి చేరుకున్న యువకులను ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్, బ్రహ్మశ్రీ శ్రీ నాగిళ్ల వేణు శర్మ ఈ ఇరువురు కలిసి యువకులను సన్మానించారు. ఈ సందర్భంగా యోగా గురువు శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశంలోని నేటి యువతరానికి ఇలాంటి యువకులు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారన్నారు. ఈ యువకులు దేశంలోని ప్రముఖ చారిత్రాత్మకమైన కట్టడాలను దర్శించుకుంటూ... ఆలయ విశేషాలను తెలుసుకుంటూ, దేవాలయాలకు వచ్చేటువంటి భక్తులకు కాలుష్య నివారణకు తీసుకోవాల్సినటువంటి సూచనలను తెలియజేస్తూ ముందుకు వెళ్లడం అభినందనీయమన్నారు. ఈ యువకులకు దేశంపై, దేశంలో ఉన్నటువంటి ప్రజలపై ఉన్నటువంటి ప్రేమ చాలా గొప్పదని తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీ నాగిళ్ల వేణు శర్మ యువకులకు భోజన వసతితో పాటు ప్రయాణంలో వేసుకోవడానికి బట్టలు, పండ్లు, మంచినీటిని అందించడం జరిగింది. మీడియా ద్వారా యువకుల పర్యటనకు సంబంధించిన విషయం తెలుసుకున్న ప్రజలు వీరికి స్వాగతం పలుకుతూ కనీస అవసరాలను తీర్చే బాధ్యతను ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా తీసుకోవాలని నాగిళ్ల వేణు శర్మ కోరారు.

## రెండో రోజు వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



**వవరంగల్ వాయిస్, వరంగల్:** శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల రెండో రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 7:30 గంటలకు బాలభోగం, యాగశాల ప్రవేశం కార్యక్రమాలు నిర్వహించబడగా, 10:00 గంటలకు పురవీధుల్లో గరుడవాహన సేవ అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వారాజు కుమారస్వామి హాజరయ్యారు. సంతాన వైనతేయ ఇష్టిగా, సంతానం కోసం భక్తులకు గరుడముద్ద ప్రసాదం పంపిణీ చేయబడింది. తీర్థ ప్రసాద విరతన అనంతరం, సాయంత్రం 5:30 గంటలకు సామూహిక శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం, దేవత ఆహ్వానం, తదనంతరం శ్రీ కళదర కూచిపూడి నృత్య కళాక్షేత్రం (కాళేశ్వరం) శిష్య బృందం ఆధ్వర్యంలో అనూష రాజుకుమార్ శర్మ ప్రదర్శన నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షులు యిరుకుల్ల రమేష్, కొత్త వెంకటకృష్ణ, పబ్బ విశ్వప్రసాద్, తోట నవీన్ కుమార్, బెజగం రజినీకాంత్, పనేష్, దివ్వెల శ్రీనివాస్, నీల రాజన్న, నాగరాజు, సత్యనారాయణ, సర్వేశ్వర్ రావు, ఎలగందుల రమేష్, పసునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పదవీ బాధ్యతలు చేపట్టిన నూతన ఆర్ఎంఓలు

### ఐఎన్ టీయూసీ ఆధ్వర్యంలో ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పబ్లిక్ హెల్త్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఐఎన్ టీయూసీ 3194 వరంగల్ ఉమ్మడి జిల్లా చైర్మన్ బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో యం.జి.యం ఆసుపత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఆర్ఎంఓ–1, డిప్యూటీ సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఆర్ఎంఓలుగా డా. అంబి శ్రీనివాస్, డా.శశికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఐ.ఎన్.టి.యూ.సి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఐఎన్టీయూసీ ఎంజీఎం బ్రాంచ్ నాయకులు ప్రీతి సజిని, సాల్మ, నార్ల వేణు, సుజాత, సరలా రాణి, కొడిపాక కార్తీక్, సంజీత, రజని, అనీస్, సత్య నారాయణ పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

### టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా శాఖ డిమాండ్




**వరంగల్ వాయిస్, వరంగల్:** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) వరంగల్ జిల్లా శాఖ విస్తృత స్థాయి సమావేశం సోమవారం రంగశాయిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఊటుకూరి అశోక్ అధ్యక్షత వహించగా, టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల వీరస్వామి సమావేశాన్ని సమన్వయపరిచారు. సభలో పూర్వ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం పెట్టుకున్న సరెండర్ లీవులు, జీపీఎఫ్ లోన్లు, ఫైనల్ సెటిల్ మెంట్లు గత రెండు సంవత్సరాలుగా మంజూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ మార్చి 31లోగా పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2024 మార్చి నుంచి పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు రావాల్సిన ప్రయోజనాలను వెంటనే చెల్లించాల్సిన అవసరం ఉందని, వీటి కోసం రిటైర్డ్ ఉద్యోగులు కోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకోవడం దౌర్భాగ్యకరమని విమర్శించారు. ఉపాధ్యాయులు తమ వేతనాల్లోంచి దాచుకున్న డబ్బులు కూడా ప్రభుత్వం విడుదల చేయకపోవడం చిత్తశుద్ధిలేకపోవడమేనని ఆయన మండిపడ్డారు. దీంతో పాటు, జిల్లా అధ్యక్షుడు ఊటుకూరి అశోక్ మాట్లాడుతూ, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 5 డీఏలు పెండింగ్‌లో ఉండటం దురదృష్టకరమని అన్నారు. జూలై 2023 నుంచి ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. డీఏల గురించి ప్రశ్నించగా, వేతనాలు ఇవ్వడమే ఇబ్బందిగా ఉందని ముఖ్యమంత్రి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని ప్రతిబింబిస్తున్నాయని వ్యాఖ్యానించారు. డీఏలు ఉద్యోగుల హక్కు అని, కేంద్ర ప్రభుత్వం తన ఉద్యోగులకు రెగ్యులర్‌గా డీఏలు ప్రకటిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్రాన్ని అనుసరించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల వీరస్వామి మాట్లాడుతూ, ఉద్యోగుల హెల్త్ కార్డులు పనిచేయకపోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. అలాగే, ఎస్సెస్సీ స్పాట్ వాల్యూయేషన్ రేట్లను పెంచాలని, వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు జయ స్వామి, జిల్లా కార్యదర్శి బి. పూర్ణచందర్, ఎం. వెంకటేశ్వర్లు, పి. సురేష్ బాబు, మండల బాధ్యులు పి. మల్లికార్జున్, డి. రమేష్, ఎం. కృష్ణ పాల్గొన్నారు.

## బండి సంజయ్ బుద్ధి మార్చుకో..

### బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్



**వరంగల్ వాయిస్, కేయూ :** తెలంగాణ రాష్ట్ర సాధకుడు, ఉద్యమనేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై అనుచిత వ్యాఖ్యలు, అసత్య ఆరోపణలు చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ కాకతీయ విశ్వ విద్యాలయ విభాగం డిమాండ్ చేసింది. బండి సంజయ్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై తప్పుడు ఆరోపణలు చేసిన నేపథ్యంలో సోమవారం బీఆర్ఎస్వీ కాకతీయ విశ్వ విద్యాలయ విభాగం విద్యార్థులు స్థానిక కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేయూ అధ్యక్షులు బైరపాక ప్రశాంత్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర, యువజన రాష్ట్ర నాయకులు కత్తెరపల్లి దామోదర్, ఇంచార్జి జెట్టి రాజేందర్ మాట్లాడుతూ బండి సంజయ్ కేంద్ర మంత్రిలా ప్రవర్తించడం లేదని, వారు మాట్లాడుతున్న మాటలు వారి దిగజారుడు తనానికి నిదర్శనంలా ఉందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ కేసీఆర్ స్థాయిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని, సూర్యుడి లాంటి కేసీఆర్ పైన ఉమ్మేస్తే అది తిరిగి బండి సంజయ్ మీదే పడుతుందని అన్నారు. బండి సంజయ్ చిల్లర మాటలు మానుకోవాలని, బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. దక్షిణాది రాష్ట్రాల పై బీజేపీ వివక్షను ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని, మోడీ కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల పైన పెత్తనం చెలయించాలని చూస్తే ఇక్కడి ప్రజలు సహించబోరని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు , రూరల్ జిల్లా కోఆర్డినేటర్ లంక రాజ్‌గోపాల్ , బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు గొల్లపల్లి వీరస్వామి, రసూరి రాజేష్, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

## ఐకమత్యమే మహా బలం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని దేశాయ్ పేట్ రోడ్డు కళ్యాణి నగర్ కాలనీ వాసులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో నిర్వహించారు. తమ కాలనీలోని కుటుంబ సభ్యులంతా ఆరెపల్లి సమీపంలో ఏఎన్ఆర్ గార్డెన్స్ లో కలుసుకొని అట పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కళ్యాణి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోలి చెన్నారెడ్డి మాట్లాడుతూ ఐకమత్యంతో ఉండడం వల్ల అందరు సంతోషంగా ఉంటారని, కాలనీలో ఆహ్లాద వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుటుంబ సభ్యులకు బహుమతులు అందజేశారు. కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి మధు సూదన్, గౌరవ అధ్యక్షుడు హరినాథ్, సలహాదారులు చిర్ల మల్లా రెడ్డి, కాలనీ వాసులు కొండల్ రావు, సంతోష్, తిరుపతి రెడ్డి, వెంకట్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి, వెంకట్ గౌడ్, రాంరెడ్డి, రాజేందర్ రెడ్డి, తుమ్మ ప్రభాకర్ రెడ్డి, సూరం ప్రతాప్ రెడ్డి, శివ కుమార్, వసంత్ కుమార్, చంద్ర శేఖర్, జయ పాల్ రెడ్డి, పల్లం కుమారస్వామి, తుమ్మ శ్రీధర్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# చదువుల తల్లి డాక్టర్ శ్రీ మాత

### హర్షం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు




**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని రాజక్క పల్లె గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన బండి సమ్మక్క తన పిల్లల చిన్నతనంలోనే భర్తను కోల్పోయిన, ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగుతూ, తన పిల్లల భవిష్యత్తే లక్ష్యంగా కూలీ పనులు చేస్తూ కూతురు శ్రీ మాత, కుమారుడు రాజులను కష్టపడి పీజీ వరకు చదివించింది. చిన్నతనం నుంచే శ్రీ మాతకు చదువుపై మక్కువ ఎక్కువ. 10వ తరగతి వరకు కొప్పుల హైస్కూల్, ఇంటర్, డిగ్రీ పరకాల, పీజీ హనుమకొండలోని కాకతీయ డిగ్రీ, పీజీ కాలేజీలో తల్లి సమ్మక్క, అన్నయ్య రాజుల సహాయంతో చదువుకుంది. వివాహం అనంతరం తన భర్త సహాయంతో శ్రీమాత హైదారాబాద్ లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో భౌతిక శాస్త్రంలో సింథసిస్, స్ట్రక్చరల్ క్యారెక్టరైజేషన్, ఆప్టికల్,మాగ్నేటిక్ అండ్ ఎలక్ట్రికల్ ప్రాపర్టీస్ ఆఫ్ సీ అండ్ జిడి దాప్డ్ నికెల్ నానో ఫరిటీస్ బై సిట్రేట్ జెల్ ఆటో కాంబుషన్ మెథడ్ అనే అంశంలో పరిశోధన పూర్తి చేసి డా. యూఎస్ఎన్ మూర్తి చేతుల మీదుగా పీహెచ్ డీ పట్టా పొందింది. ప్రస్తుతం శ్రీ మాత నిజామాబాద్ లోని తెలంగాణ యూనివర్శిటీలో భౌతిక శాస్త్రంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా డా శ్రీ మాత మాట్లాడుతూ చిన్నతనం నుంచి తన చదువుకు సహకరించిన తల్లి సమ్మక్క, అన్నయ్య రాజులకు, వివాహ అనంతరం తన చదువును గుర్తించి పీహెచ్ డీ పట్టా సాధించడానికి ప్రోత్సహించి, సహకరించిన భర్త శ్రీనివాస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, మార్చి 24, 2025

# మహిళా పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** షీ టీమ్స్, మహిళా పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సోమవారం సందర్శించారు. షీ టీమ్స్ కార్యాలయం, మహిళా పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అక్కడి పనితీరును సమీక్షించారు. మహిళా భద్రత, హక్కుల పరిరక్షణ, హింసా వివరాలు, కేసుల ప్రగతి మొదలైన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ “మహిళలపై జరిగే నేరాలను పూర్తిగా అరికట్టేందుకు షీ టీమ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. బాధితులకు తక్షణ సహాయం అందించి, న్యాయం కల్పించేందుకు నిరంతరం పని చేస్తుందన్నారు. మహిళా పోలీస్ స్టేషన్లను మరింత బలోపేతం చేసి, ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్ నిర్వహిస్తున్న కార్యకలాపాలపై సమీక్షించారు. కాలేజీలు, కార్యాలయాలు, బస్టాండ్లు, పబ్లిక్ ప్లేసుల్లో మహిళల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, హారస్‌మెంట్‌పై ఆపరేషన్ల గురించి ఆర్ఎస్సై సునందాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళల భద్రతకు సంబంధించి హెల్ప్‌లైన్ నంబర్లు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహిళా పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, నేర నివేదికలు, పెండింగ్ కేసులు, బాధితులకు అందిస్తున్న సహాయం, కౌన్సెలింగ్ సేవలు, స్టేషన్‌లో మహిళా సిబ్బంది సంఖ్య గురించి సమీక్షించారు. బాధిత మహిళలతో మాట్లాడి, వారికి పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి అందించాల్సిన సహాయంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. మహిళల కోసం ప్రత్యేక పోలీస్ స్పందన వ్యవస్థను మరింత మెరుగుపరచాలని, పోస్కో, గృహహింస, వేధింపుల కేసుల్లో బాధితులకు తక్షణ న్యాయం అందించేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలపై నేరాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఎస్.బీ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, సీఐ సరవయ్య, ఎస్ఐ దీపిక, షీ టీమ్స్, ఆర్ఎస్సై సునందా, ఎస్ఐ ఆనందం, సిబ్బంది పాల్గొన్నారు.

# యథేచ్ఛగా నల్లబెల్లం రవాణా

## పట్టణ శివారులో గుప్పుమంటున్న గుడుంబా

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నల్లబెల్లం అక్రమ రవాణాపై అధికార యంత్రాంగం ఉక్కు పాదం మోపిన అక్రమార్కులు యథేచ్ఛగా అక్రమ మార్గాల్లో రవాణా కొనసాగిస్తూ అధికారులకు సవాల్ విసుతున్నారు. గతంలో రైళ్లల్లో ద్వారా సుదూర ప్రాంతం నుంచి నల్లబెల్లం పట్టికను రావాణాను కొనసాగించిన అక్రమార్కుల రైల్వే పోలీస్ ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో పని చేసి ఈ రవాణాను అడ్డుకోవడంతో అక్రమార్కులు ఇతర మార్గాలను ఎంచుకున్నారు. దీనిని అరికట్టడానికి పోలీస్ ఎక్సైజ్ శాఖలు ఎన్ని చర్యలు తీసుకున్న ఈ అక్రమ రవాణాను నియంత్రించడంలో అధికార యంత్రాంగం విఫలమవ్వడంతో మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల్లీ గల్లీల గుడుంబా గుప్పుమంటుంది. నల్ల బెల్లం రవాణా చేసే అక్రమార్కులు శివారు తండాలలో నిల్వ ఉంచి గుట్టు చప్పుడు కాకుండా అవసరం ఉన్న చోటికి తరలిస్తున్నారు. అంతే కాకుండా మొహబ్బత్ పట్టణంలోని కొందరు వ్యాపారులు ఈ అక్రమ రవాణాలో పాలు పంచుకుంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ యథేచ్ఛగా నల్లబెల్లం లభ్యమవడంతో శివారు కాలనీల్లో గుడుంబా గుప్పుమంటుంది. అక్రమార్కులపై ఎన్ని కఠిన చర్యలు తీసుకున్న వారి పద్ధతిని మార్చుకోకపోవడం గమనార్హం. ఈ బెల్లం అక్రమ రవాణా మూలంగా ప్రజలు సాధారణంగా వాడే బెల్లంపై కూడా ఆంక్షలు పెట్టడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

# ఎన్ హెచ్‌ఆర్సీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా కొమ్ము రాజు



**వరంగల్ వాయిస్, దామెర :** జాతీయ మానవ హక్కుల కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ మహమ్మద్ యాసిన్, రాష్ట్ర చైర్మన్ బద్దిపడిగా శ్రీనివాస్ రెడ్డి ఆదేశానుసారం జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాల్నే లక్ష్మి, హనుమకొండ జిల్లా చైర్మన్ దుబాసి నవీన్, వరంగల్ జిల్లా చైర్మన్ గంగుల అశోక్ ఆధ్వర్యంలో హనుమకొండలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గా కొమ్ము రాజును నియమించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కన్వీనర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చినందుకు రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ హెచ్ ఆర్ సి సంస్థలో సభ్యుడిగా ఎల్లప్పుడూ రాష్ట్ర చైర్మన్, జిల్లా చైర్మన్లకు సహకరిస్తామని, సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తానని, పేద ప్రజల తరపున చట్టపరమైన ప్రక్రియలో మన హక్కులకు భంగం కలుగకుండా కృషి చేస్తానన్నారు.

# ఈనెల 26 నుంచి ఫైనల్ సెలెక్షన్స్

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా గిరిజన బాలుర విద్యార్థుల కోసం ఈనెల 12 నుంచి 16 వరకు, 17 నుంచి 20 వరకు వివిధ జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలెక్షన్స్ లో పాల్గొన్న విద్యార్థులకు, ఫైనల్ సెలెక్షన్స్ ఈనెల 26 నుంచి 28 వరకు మహబూబాబాద్ జిల్లా పాకాల కొత్తగూడలోని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ లో నిర్వహించబడునని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి దేశీరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్పోర్ట్స్ స్కూల్ లో ఖాళీగా ఉన్న సీట్ల వివరాలు, 5వ తరగతిలో 40 సీట్లు, 6వ తరగతిలో 8 సీట్లు, 7వ తరగతిలో 6 సీట్లు, 8వ తరగతిలో 4 సీట్లు, 9వ తరగతిలో 6 సీట్లు,10వ తరగతిలో 16 సీట్లు ఉన్నాయని, ఈ ఖాళీలను బ్యాటరి టెస్ట్ ద్వారా నింపుతామన్నారు. కాబట్టి, ఈ అవకాశాన్ని గిరిజన విద్యార్థులు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

- యువత వాటికి దూరంగా ఉండాలి
- రేగొండ ఎస్ఐ సందీప్ కుమార్



**వరంగల్ వాయిస్, రేగొండ :** ఆన్ లైన్ గేమ్స్, మాదక ద్రవ్యాలు, క్రికెట్ బెట్టింగ్ కు యువత దూరంగా ఉండాలని రేగొండ ఎస్సై సందీప్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్ లైన్ లో రోజుకొక రకమైన క్రికెట్ బెట్టింగ్స్ యాప్ లు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఆఫర్స్, బెట్టింగ్ ఫ్రీ అంటూ యువత ఆకర్షించి వారి జీవితాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. ఒకసారి ఆడిచూద్దాం అని సరదాగా మొదలుపెట్టి వీటి బారిన పడిన యువకులు బయటకు రావడం అనేది కష్టతరమైన విషయమని అన్నారు. ఈ బెట్టింగ్ కు అలవాటు పడ్డవాళ్లు అప్పుల పాలు కావడమే కాకుండా.. చేసిన అప్పులు తీర్చలేక చివరికి ఆత్మహత్యలు పాల్పడుతున్నారని తెలిపారు. క్రికెట్ ఆటను అభిమానించే వారు ఎక్కువ సంఖ్యల్లో ఉంటారని, వారికి ఈ నెలలో ప్రీమియర్ లీగ్ సీజన్ ఎంతో ఇష్టమైనదన్నారు. ప్రజల్లో క్రికెట్ కు ఉన్న మక్కువను ఆసరాగా తీసుకొని క్రికెట్ బెట్టింగ్ ముఠాలు ఎలాగైనా క్యాష్ చేసుకోవడానికి సిద్ధంగా ఉంటాయన్నారు. అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలని ఆశ పడొద్దన్నారు. ఆన్ లైన్ క్రికెట్ బెట్టింగ్ కారణంగా ఎంతో మంది జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. క్రికెట్ ఐపీఎల్ బెట్టింగ్ లు పెట్టడం, చట్ట విరుద్ధమైన ఆటలు ఆడడం నేరమని, అలాంటి వారిని ప్రోత్సహించిన వారు సైతం చట్టపరమైన శిక్ష అనుభవించక తప్పదన్నారు. యువత చెడు మార్గంలో వెళ్లకుండా చూడవలసిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు యువజన సంఘాలపై ఎంతో బాధ్యత ఉందని ఎస్సై సందీప్ కుమార్ పేర్కొన్నారు.

# ఒకే దేశం.. ఒకే ఎన్నిక బీజేపీ దృష్టి కోణం

## 15వ డివిజన్ మొగిలిచెర్లలో కార్యశాల



**వరంగల్ వాయిస్, మొగిలిచెర్ల :** గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్లలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ల్యాదల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఒకే దేశం ఒకే ఎన్నిక కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా నాయకులు, ఒకే దేశం, ఒకే ఎన్నిక ప్రోగ్రాం డివిజన్ కన్వీనర్ రాదారపు శివకుమార్ మాట్లాడుతూ భారత దేశంలో విపక్ష పార్టీలవి అవకాశవాద రాజకీయాలు అని ఏ ఎండకు ఆ గొడుగు పట్టిన విధంగా ఎన్నికల ముందు ఇచ్చినటు వంటి హామీల అమలు చేతకాక తెలంగాణ రాష్ట్రంలో, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం దృష్ట్యా రాజకీయాలు చేస్తూ డీలిమిటేషన్ పై దుష్ప్రచారం చేస్తూ, ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని డిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ అనే చందంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆడెపు రమేష్, జిల్లా కౌన్సిలర్ బిల్లా రమేష్, డివిజన్ నాయకులు లెంకలపెల్లి స్వామి, గుండె బోయిన రంజిత్, పిల్లల రవీందర్, రాదారపు మల్లికార్జున్, జెల్ల నాగరాజు, గబ్బేట శ్రీనివాస్, బందేల రేణుకా, కందుల రవివర్మ, ల్యాదెల్ల శ్యామ్, మంద కోర్నెల్, కొట్టే భవాని, పంజా స్రవంతి, ల్యాదళ్ల సంధ్య, తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఇఫ్తార్ విందులు ఎలా ఇస్తారు.?

## బీజేపీ జిల్లా నేత కుందూరు మహేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** గుడి కడితే బిచ్చగాళ్ళు తయారవుతారని మాట్లాడి హిందూ మతాన్ని అగౌరవ పరిచిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నేడు ఒక మతాన్ని గౌరవిస్తూ మరో మతాన్ని వ్యతిరేకించడం చాలా విడ్డూరంగా ఉందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుని విమర్శించారు. ఒక మతానికి చెందిన ఓట్లను ప్రామాణికంగా తీసుకొని వాళ్లని మాత్రమే ఓటర్లుగా భావిస్తూ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగా మార్చుకుంటూ మిగతా మతాలను కులాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నియోజకవర్గంలో ఎన్నో కులాలు, మతాలు ఉన్న వారందరినీ కలుపుకొని పోకుండా కేవలం ఒక వర్గాన్ని వారి ఓటర్లుగా సృష్టించుకోవడం విడ్డూరంగా ఉందని మహేందర్ రెడ్డి అన్నారు. ఇప్పటికైనా మైనార్టీ సోదరులు కాంగ్రెస్ పార్టీ చేసే మోసాలను గమనించి వారికి చేస్తున్న అన్యాయాలను గుర్తించి కాంగ్రెస్ పార్టీకి వచ్చే స్థానిక సంస్థల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని వారికి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని హిందూ బంధువులంతా ఒకటై కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి ధ్యేయంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని మహేందర్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు.

# కోటగుళ్లను సందర్శించిన ఇటలీ ఆర్కిటెక్చర్ బృందం



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లను ఇటలీకి చెందిన రాబర్టొ ,మేఘా ఆధ్వర్యంలో ఇటలీ ఆర్కిటెక్చర్ బృందం సోమవారం సందర్శించారు. మొదట ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. రుద్రాభిషేకం అనంతరం ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇటలీ బృందం ఆలయ శిల్ప సంపదను తమ కెమెరాల్లో ఫొటోలు వీడియోలు చిత్రీకరించుకున్నారు. హైదరాబాదులో నూతనంగా నిర్మించనున్న ఒక మండపానికి నమూనా కోసం కోటగుళ్లను సందర్శించినట్లు ఇటలీ బృందం తెలిపారు.

## ట్రాఫిక్‌ను నియత్రించేందుకు సహకరించాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని సీఐ రాజేష్ నాయక్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని పలు దుకాణాలు, రోడ్డుకు ఇరువైపులా నెలకొల్పిన చిరు వ్యాపార డబ్బాలను కమిషనర్ ఉదయతో కలిసి పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలను ఆక్రమించి వాటిపై నిర్మాణాలు చేపట్టే వ్యాపారులతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని వీటి నివారణకు కాలువలపై ఏర్పాటైన దుకాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంతే కాకుండా రోడ్డు అంచున మార్జిన్ ఏర్పాటు చేసి అందులోనే వాహనాలను నిలుపుదల చేయించాలని దుకాణ యజమానులకు నోటీసులు ద్వారా తెలియజేస్తామన్నారు. పట్టణంలో ఖాళీగా ఉన్న ఓ స్థలాన్ని పరిశీలించి అందులో ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ ఏర్పాటుకు సమాలోచన చేస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు దుకాణ సముదాయాలు, యజమానులు ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు సహకరించాలన్నారు. ఎస్ఐ, వంశీధర్, ఉమాతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మున్నూరు కాపు పరపతి సంఘం సర్వసభ్య సమావేశం

### నూతన కమిటీ ఎన్నిక ఎన్నిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మున్నూరు కాపు పరపతి సంఘం పద్మాక్షి రోడ్డు దర్వాజ పక్కన గల భవనంలో సోమవారం 41వ, వార్షిక సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా తోట ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా కనుకుంట్ల రవికుమార్, కోశాధికారిగా బొల్లం అశోక్, ఉపాధ్యక్షుడిగా బండారి మహేందర్, సహాయ కార్యదర్శి పోలు లక్ష్మణ్, ఆడిటర్ గందె మధు, కార్యవర్గ సభ్యులుగా కనుకుంట్ల శ్రీనివాస్, యాప చెట్టి లక్ష్మణ్, కర్రు మనోజ్ కుమార్, మంద రాకేష్, మిరుకుల రేవంత్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘ సభ్యుడు చనిపోతే రూ.25,000 ఇవ్వాలని తీర్మానించారు. లోను రూ. 3 లక్షల ఇవ్వాలని 49 మంది నూతన సభ్యులను తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ ఎన్నికల అధికారిగా పదవ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, గందె కృష్ణ, అంబటి కుమారస్వామి, పాటి శ్రీనివాస్ నూతన ఎన్నికలు నూతన తీర్మానాలు చేశారు. ఈ మీటింగ్ కు వచ్చిన వారికి మహిళా సభ్యులకు అందరికీ కూడా రూ.1000 ఇవ్వాలని, ఉగాది కానుకగా మటన్ కోసం రూ.1000 ఇవ్వాలని తీర్మానించారు.

## కమలాపూర్ బస్టాండుకు రూ.కోటి కేటాయించాలి

### హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హుజురాబాద్ స్పోర్ట్స్ గ్రౌండ్ కోసం గత ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించిందని, ఇప్పటికి 20 శాతం వరకు కూడా పూర్తయిందని వెంటనే పనులు పూర్తయ్యేలా చేసి క్రీడాకారులకు మంచి క్రీడా మైదానాన్ని అందించాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన నియోజకవర్గ సమస్యలతో పాటు 4అంశాలు మాట్లాడారు. కమలాపూర్ మండలంలో రూ. కోటి 75 లక్షలతో బస్టాండ్ నిర్మాణం జరిగిందని, మరో కోటి రూపాయలు కేటాయిస్తే పూర్తి స్థాయిలో బస్టాండ్ నిర్మాణం అవుతుందన్నారు. అలాగే, ఉప్పల్ లో రూ. 45 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టామని, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ ని రెండుసార్లు ఇక్కడ నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసి పార్లమెంటుకు పంపినప్పటికీ రైల్వే బ్రిడ్జి కట్టకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని అన్నారు. దీంతో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు ఉమెన్ అండర్–19 క్రికెట్ కు ఎంపికయ్యారని, అందులో త్రిషకి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల నజరానా అందజేసిందని, ద్రితికి కేవలం రూ.10లక్షలు మాత్రమే ఇచ్చారని, తనకు కూడా రూ.కోటి కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వెంటిలేటరుపై తెలంగాణ ఉద్యమకారుడు

- చికిత్సకు రూ.10 లక్షల ఖర్చు
- ఆదుకోవాలని కుటుంబ సభ్యుల వినతి

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమంలో చురుకుగా పనిచేసిన కార్యకర్త నేడు రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాదులోని ఒక ఆసుపత్రిలో వెంటి లేటర్ పై చికిత్స పొందుతూ నిస్సహాయ స్థితిలో ఉన్నాడు. వివరాలలోకి వెళితే ఆత్మకూరు మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన కాకాని శ్రీధర్ గత 25 సంవత్సరాల క్రితం తెలంగాణ రాష్ట్ర సమితిలో కార్యకర్తగా చేరి ప్రత్యేక తెలంగాణ కోసం పూర్తిస్థాయిలో కార్యకర్తగా పనిచేసి ఉద్యమంలో పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం చేపట్టిన ప్రతి ఆందోళనలో ముందుండే వారు. ఆ తర్వాత టీఆర్ఎస్ లో పూర్తి స్థాయి కార్యకర్తగా పనిచేయడంతో పాటు ఆత్మకూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా కూడా పనిచేశారు. అయితే ఆత్మకూరు నుంచి బైకుపై నీరుకుల్ల గ్రామానికి వస్తుండగా నీరుకుల్ల క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న బైకు ఢీకొనడంతో తీవ్ర గాయాలు కావడంతో వరంగల్ ఆసుపత్రిలో చేర్పించారు. గాయాలు తీవ్రంగా కావడంతో ఇబ్బందిగా తయారైంది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. కాకాని శ్రీధర్ ను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం శ్వాసకు ఇబ్బంది కావడంతో ఆ ఆస్పత్రి వర్గాలు హైదరాబాద్ కు తరలించాలని సూచనలు చేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం కాకాని శ్రీధర్ ను హైదరాబాదులోని యశోద ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో ప్రస్తుతం శ్వాసకు ఇబ్బంది కావడంతో వెంటలేటర్ పై చికిత్స చేస్తున్నారని అతని భార్య స్వప్న తెలిపారు. ఆసుపత్రిలో చికిత్సకు దాదాపు రూ.10లక్షలు అవసరమవుతాయని తమకు ఆదుకోవాలని ఆమె అన్నారు. టీఆర్ఎస్ లో పూర్తిస్థాయిగా శ్రీధర్ పనిచేశారని ఆమె తెలిపారు. ప్రస్తుతం ఇల్లు గడవడమే కష్టంగా మారిందని, రూ.10 లక్షలు చికిత్సకు ఎలా తేవాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిస్సహాయ స్థితిలో ఉన్న, తమ భర్త ఆసుపత్రిలో చికిత్సకు ఆర్థిక సాయం అందించాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఐటీ మంత్రి కేటీఆర్, మాజీ ఆర్థిక మంత్రి తన్నీరు హరీష్ రావులను కోరారు. తమకు సాయం అందించే వారు 99663 28357 ఫోన్ నెంబర్ కు ఫోన్ పే ద్వారా ఇతర రకాల ద్వారా సాయం అందించాలని కోరారు. తమను ఆదుకోవాలని టీఆర్ఎస్ నాయకులను కోరారు.



## సేంద్రీయ ఉత్పత్తులతోనే ఆరోగ్య రక్షణ

- విశ్రాంత వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త జలపతిరావు

**వరంగల్ వాయిస్, రేగొండ :** రాష్ట్రంలో రైతులు ఆధునిక సాంకేతిక రంగంలో వ్యవసాయ పద్ధతులు పాటించడంతోపాటు గో–ఆధారిత వ్యవసాయ సాగు పట్ల రైతులు మొగ్గు చూపాలని విశ్రాంత వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త జలపతిరావు అన్నారు. జయశంకర్, భూపాలపల్లి జిల్లా (జేబీడీ) వ్యవసాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గూడెప్పాడ్ ఎస్ఎస్ఆర్ గార్డెన్ లో జిల్లా వ్యవసాయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిరికొండ తిరుపతిరావు ఆధ్వర్యంలో రైతులతో అవగాహన సదస్సు జరిగింది. ఈ అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త జలపతిరావు పాల్గొనగా, ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మరావు, హెచ్ఎంటీవీ జోర్దార్ రాములు, ఎస్ఎస్ఆర్ సమస్యల అధినేత నాయినేని సంపత్ రావు, జిల్లాల నాయకులు నల్లమల్ల వెంకటేశ్వరరావు (ఖమ్మం) ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ పీఆర్ఓ శరత్, (నేల సాగు యాంకర్) రాజేశ్వరరావు, లింగంపల్లి ప్రసాద్ రావు, బాబురావు, పలువురు సొసైటీ సభ్యులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వ్యవసాయ సంఘం సొసైటీ నాయకులు, రైతులు, ప్రముఖ వ్యవసాయ శాఖ నిపుణులు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ముందుగా జేబీడీ ఆధ్వర్యంలో వ్యవసాయ రంగానికి ప్రత్యక్షంగా పరోక్షంగా కృషిచేసిన వారిని ఉగాది పురస్కారాల సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించారు. రైతు అవగాహన సదస్సుకు ఎస్ఎస్ఆర్ గార్డెన్ లో జరిగిన రైతు సదస్సుకు సేంద్రియ, గో–ఆధారిత, వర్మీ కంఫర్ట్ ఎరువులతో రైతులు సాగు చేసి పండించిన వరి ధాన్యాన్ని, బియ్యాన్ని, పలు రకాల పూలతో తయారుచేసిన సుగంధ ద్రవ్యాలు, ఆయుర్వేదంతో తయారుచేసిన పలు రకాల మెడిసిన్ తో కూడిన ఎగ్జిబిషన్ ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సిరికొండ తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన



అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వ్యవసాయ శాస్త్రవేత్త జలపతిరావు మాట్లాడుతూ రాను రాను వ్యవసాయ పంటలకు రైతులు ఉచ్చలవిడిగా రసాయన ఎరువులను పురుగు మందులను వాడడంతో భూమి సారం తగ్గడంతో పాటు, ప్రజలకు కూడా కొంతమేర నష్టం జరుగుతుందన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పాటు గో ఆధారిత వ్యవసాయ పంటలను కూడా రైతులు అలవాటు చేసుకోవాలని, దాని వలన రైతులకు కొంతమేర ఇబ్బంది ఏర్పడిన రాను రాను రైతుల రాబడి పెరుగుతుందని జలపతిరావు పేర్కొన్నారు. సేంద్రీయ, గోఆధారిత సాగుపట్ల అనేక విధాలుగా కృషి చేయడం అభినందనీయమన్నారు. గో–ఆధారిత వ్యవసాయ పద్ధతులతో రైతులకు లాభదాయం ప్రజలకు ఆరోగ్యకరంగా ఉండేందుకు కృషి చేస్తున్న తిరుపతిరావు కృషి ఫలించాలని పలువురు వ్యక్తులు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. జిల్లాలతో పాటు రాష్ట్రాల్లో గోఆధారిత వ్యవసాయ సాగు పెరిగి, ముల్కనూరు రైతు సొసైటీ సంఘం లాగా అభివృద్ధి చెందాలని పలువురు కోరుకున్నారు. రైతుల సంక్షేమం కోసం రైతు బీమా పథకాలతో పాటు, నేల సాగు పరిశీలన పంటల సాగు, విత్తనాలు కొంతమేర తగ్గించి ఇవ్వడంతో పాటు ఉచితంగా సభ్యత్వం తీసుకున్న వారికి అందజేయడం అభినందనీయమన్నారు. సొసైటీ అభివృద్ధికి వ్యవసాయ రంగ నిపుణులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తమ వంతు కృషి అందించాలని జిల్లా అధ్యక్షులు సిరికొండ తిరుపతిరావు ఈ సందర్భంగా కోరారు.

## ఏప్రిల్ 3న హాలో కురుమ.. చలో హైదరాబాద్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ 98వ జయంతి సభ ఏప్రిల్ 3న జరుగు జయంతి సభకు వరంగల్ నుంచి భారీ సంఖ్యలో కురుమలు తరలిరావాలని కార్పొరేటర్ మరుపల్ల రవి కురుమ కోరారు. సోమవారం నగరంలోని కరీమాబాద్ కురుమల ఇలవేల్పు అయిన బీరన్న దేవస్థానంలో దొడ్డి కొమురయ్య కురుమ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి దయ్యాల సదయ్య సభా అధ్యక్షత వ్యవహరించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షులు, కార్పొరేటర్ మరుపల్లి రవి హాజరయ్యారు. అనంతరం రవి మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య జయంతి సభకు భారీగా తరలి వెళ్దాం.. దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిని తెలంగాణ నలదిక్కుల చాటుదాం.. కురుమ డోలు డమరుకం, తాళం ఓరేత్తుదాం తెలంగాణ చైతన్యం దశ దిశల రగిలిద్దాం.. కురుమల ఐక్యత చాటుదామన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాల కోర్ కమిటీ సభ్యులు దయ్యాల సదయ్య, వరంగల్ కురుమ పెళ్లి పందిరి కన్వీనర్లు మండల నరసింహా రాములు, అన్న రాజు, డిప్యూటీ తాసిల్దార్ చీర జగన్, కుండే కుమారస్వామి, కరీమాబాద్ బీరన్న దేవస్థానం కమిటీ అధ్యక్షులు కోరే సదానందం, కార్యదర్శి కోరే నాగరాజ్, కోరే కృష్ణ, మురికి రాజు, మురికి రవి, దయ్యాల వీరేశం, ముదిగిరి రవి, సురేష్, యారా రాజేందర్, గుండ ఎల్లేష్, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




# మన అవార్డులను లాగేసుకుంటున్నారు

**: దీపికా పదుకొణె**

మన దేశంలో ఎంతోమంది ప్రతిభ ఉన్న నటీనటులున్నారనీ, అయితే చాలాసార్లు మనకు రావలసిన అవార్డులను లాగేసుకున్నారని దీపికా పదుకొణె కామెంట్స్ చేశారు. ఈ మేరకు ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో షేర్ చేశారు. అందులో ఆస్కార్ గురించి తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకున్నారు. ''భారతదేశం సినీ చరిత్రలో ఎన్నో గొప్ప కథలు తెరకెక్కాయి. కానీ ఆ సినిమాలకు, ఆ కథలకు, నటీనటుల ప్రతిభకు ఏమాత్రం గుర్తింపు రాలేదు. 'చాలాసార్లు మనకు రావాల్సిన ఆస్కార్‌లను లాగేసుకున్నారు. 'ఆర్‌ఆర్‌ఆర్'లోని పాటకు ఆస్కార్ ప్రకటించినప్పుడు నేను ప్రేక్షకుల్లో కూర్చొని ఉన్నాను. ఆ సమయంలో ఎంతో భావోద్వేగానికి  గురయ్యాను. నిజానికి ఆ సినిమాతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను ఆ సినిమాలో భాగం కూడా కాదు. కేవలం ఒక భారతీయురాలిగా ఇది మన సినిమా అని ఆ క్షణంలో వ్యక్తిగతంగా ఎంతో ఆనందం కలిగింది. ఆ క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేను. 'ది బ్రూటలిస్ట్' చిత్రానికి గాను ఈ ఏడాది అడ్రియన్ బ్రాడీ ఉత్తమ నటుడిగా ఆస్కార్ గెలిచినందుకు నేను సంతోషించాను'' అని అన్నారు. 2023 ఆస్కార్ వేడుకలో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని నాటునాటుని పాటనుఉ దీపిక ప్రేక్షకులకు పరిచయం చేశారు. 'డు యూ నో నాటు?' తెలియకపోతే ఇప్పుడు తెలుసుకుంటారు. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం నుంచి 'నాటు నాటు' ఇదే..' అంటూ దీపిక ఈ పాటను పరిచయం చేయడం విశేషం.

# ఆమె అందానికి హద్దులు లేవు

అందాల ముద్దుగుమ్మ బాలీవుడ్ నటి దిశా పటానీ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. లోఫర్ సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయం అయ్యింది ఈ చిన్నది. ఈ మూవీ తర్వాత ఈ ముద్దుగుమ్మకు అంతగా అవకాశాలు రాలేదు. కానీ బాలీవుడ్‌లో మాత్రం ఈ బ్యూటీ వరస సినమాలతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. గ్లామర్ పాత్రలతో కుర్రకారును మాయ చేస్తుంది. అయితే తాజాగా ఈ అమ్మడు తన ఇన్ స్టాలో పలు ఫోటోలు పోస్టు చేసింది. అందులో ఐపీఎల్ ఓపెనింగ్ అంటూ షేర్ చేసిన ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. దిశా తాజాగా ఐపీఎల్ 2025 ఓపెనింగ్ సెరోమణిలో కనిపించి అందరినీ ఆకట్టుకుంది. క్రిస్టల్స్‌తో తయారు చేయించిన డ్రెస్‌లో తన అందాలను ఆరబోతస్తూ, డ్యాన్స్ పుర్ఫామెన్స్‌తో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతుండటంతో, దిశా పటాని అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. బ్యూటిఫుల్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు ఈ అమ్ముడు అభిమానులు.



## ఉగ్రవాద కదలికలపై తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. రజనీకాంత్



సముద్రతీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు  అప్రమత్తంగా ఉండాలని సూపర్ స్టార్ రజనీకాంత్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కొత్త వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉగ్రవాదులు సముద్ర మార్గం ద్వారా దేశంలోకి చొరబడే అవకాశం ఉందని.. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు. మన దేశ కీర్తిని దెబ్బతీసేందుకు ఉగ్రవాదులు సముద్రమార్గం ద్వారా చొరబడి విధ్వంసం సృష్టిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా 26/11 ముంబై ఉగ్రదాడి ఘటనను రజనీకాంత్ ఉదహరించారు. ఈ దాడి ఘటనలో సుమారు 175 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. అందువల్ల సముద్ర తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 100 మంది సీఐఎస్ఎఫ్ జవాన్లు పశ్చిమ బెంగాల్ నుంచి కన్యాకుమారి వరకు దాదాపు 7 వేల కిలోమీటర్ల సైకిల్ ప్రచార యాత్ర చేపట్టనున్నారని తెలిపారు. వారు మీ ప్రాంతాలకు వచ్చేటప్పుడు స్వాగతించాలని సూచించారు. కుదిరితే వారితో కొంచెం దూరం వెళ్లి వారికి సహకరించాలని కోరారు.

## వాళ్లకు లేని ప్రాబ్లమ్స్ మీకెందుకు..?



బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం సికందర్. ఈ సినిమాకు మురుగదాస్ దర్శకత్వం వహించారు. ఇందులో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా.. కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో కనిపించనుంది. ఈ మూవీ మార్చి 30న ఈద్ పండుగ కానుకగా థియేటర్లలోకి రానుంది. అయితే, ఈ సినిమాలో రష్మిక, సల్మాన్ మధ్య ఏజ్ గ్యాప్‌పై నెట్టింట తీవ్ర విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఏజ్ గ్యాప్ వివాదంపై సల్మాన్ స్పందించారు. ఈ మేరకు విమర్శకులకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'నాకు, హీరోయిన్ రష్మికకు మధ్య దాదాపు 31 ఏళ్ల వయసు తేడా ఉందని కొందరు అంటున్నారు. ఏజ్ గ్యాప్ విషయంలో రష్మికకు ఎలాంటి ప్రాబ్లమ్ లేదు. ఆమె తండ్రికి కూడా సమస్య లేదు. వాళ్లకే లేని సమస్య మీకు ఎందుకు..? రష్మికకు పెళ్లయ్యాక ఆమె కూతురితో కూడా నటిస్తా. వాళ్లకు లేని ప్రాబ్లమ్స్ మీకెందుకు..?' అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రస్తుతం సల్మాన్ రియాక్షన్ నెట్టింట వైరల్ అవుతోంది. బాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్టలలో సికందర్ ఒకటి. కోలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఏఆర్ మురుగదాస్, సల్మాన్ ఖాన్ కాంబో ఈ సినిమా రాబోతుండగా.. ఈ సినిమాను నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సత్యరాజ్ విలన్‌గా నటిస్తున్నాడు.

## హార్రర్, కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో ..

టాలీవుడ్ యాక్టర్ వరుణ్ తేజ్ నటిస్తోన్న తాజా చిత్రం వీటీ15. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే కొరియన్ కనకరాజు  (వీటీ15 వర్కింగ్ టైటిల్) ఫస్ట్ లుక్ షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతోంది. ఇండో–కొరియన్ హార్రర్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. ఈ మూవీ సోమవారం పూజా కార్యక్రమాలతో హైదరాబాద్‌లో ఘనంగా మొదలైంది.  మేర్లపాక గాంధీ వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి సినిమాలతో టాలీవుడ్‌లో డైరెక్టర్‌గా మంచి గుర్తింపు సంపాదించుకున్నాడు. ఈ డైరెక్టర్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. కాగా వీటీ 15 ఫస్ట్ లుక్‌లో డ్రాగన్ డిజైన్ ఉన్న జాడిపై కోడ్ లాంగ్వేజ్‌తో ఉన్న క్లాత్ మంటలు అంటుకొని అనుమానాస్పదంగా కనిపిస్తుండగా.. సస్పెన్స్, కామెడీ ఎలిమెంట్స్‌తో కూడిన కథతో సినిమా ఉండబోతుందని హింట్ ఇచ్చేస్తుంది. ఇక వేట హాస్యాస్పదంగా మారితే అంటూ పోస్టర్‌లో రాసిన క్యాప్షన్ సినిమాపై ఆసక్తిని పెంచేస్తుంది. వరుణ్ తేజ్ చివరగా మట్కా సినిమాలో నటించగా.. బాక్సాఫీస్ వద్ద ఊహించని ఫ్లాప్ టాక్ మూటగట్టుకుంది. ఎఫ్ 3 తర్వాత సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న వరుణ్ తేజ్ మేర్లపాక సినిమాపై భారీగానే ఆశలు పెట్టుకున్నాడు.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, మార్చి 24, 2025

# షటిల్ లో సత్తా చాటిన గడ్డం కేశవమూర్తి

◆ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గోవాలో జరిగిన 47వ భారత మాస్టర్స్ (వెటరన్) నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తిని సోమవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ ఆవరణలో ప్రెస్ క్లబ్ బాధ్యులు ఘనంగా సన్మానించారు. ఆరుపదుల వయసులో మాటల్లోనే కాకుండా క్రీడల్లో కూడా అద్భుత ఫాంతో పథకం సాధించిన గడ్డం కేశవమూర్తిని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ తదితరులు శాలువాకప్పి, జ్ఞాపిక అందించి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ పూర్వ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి సలహాలు, సూచనలు క్లబ్ కు అవసరమన్నారు. నిరంతరం జర్నలిస్టుల పక్షాన నిలుస్తూ తన వాద్గాటితో తప్పొప్పులను నిర్భయంగా వెల్లడించే గొప్ప మనసున్న నాయకుడు కేశవమూర్తి అని కొనియాడారు. ఎంతో క్రమశిక్షణతో ఉంటే తప్ప 59 ఏళ్ల వయస్సులో షటిల్ ప్లేయర్ గా రాణించడం సాధ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం, బొడిగె శ్రీను, ఈసీ మెంబర్ దిలీప్, జర్నలిస్ట్ యూనియన్ నాయకుడు కక్కెర్ల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.
షటిల్ లో అత్యుత్తమ ప్రతిభ

## జాతీయ స్థాయి మెయిన్ డ్రాలో కేశవమూర్తి ప్రవేశం

గోవాలో ఐదు రోజులపాటు జరిగిన నలభై ఏడవ భారత మాస్టర్స్ (వెటరన్) నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ వెటరన్ విభాగం 55 ప్లస్ పోటీల్లో హనుమకొండ జేఎన్ఐఎస్ క్రీడాకారుడు, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గుజరాత్, రాజస్థాన్ జట్టు క్రీడాకారులను సునాయాసంగా ఓడించి జాతీయస్థాయి మెయిన్ డ్రాలో ప్రవేశించారు. అనంతరం ఝార్ఖండ్ జట్టు




క్రీడాకారులపై 21-13, 21-11 స్కోరుతో విజయం సాధించారు. ఆరుపదుల వయసులో అద్భుత ఆటతో అందరిని ఆకట్టుకున్న గడ్డం కేశవమూర్తికి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) జాతీయ ప్రధాన కార్యదర్శి సందీప్, చీఫ్ కోచ్ త్రిలోక్ శుక్ల చేతుల మీదగా ప్రశంసా పత్రం అందజేశారు. గోవాలో జరిగిన ఈ పోటీల్లో వరంగల్ జిల్లా నుంచి 18 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. టీబీఏ అధ్యక్షులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో 55 ప్లస్ షటిల్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతీయ క్రీడాకారులు గడ్డం కేశవమూర్తి, కొత్తగట్టు సుధాకర్, కొలుగూరి ప్రభాకర్ రావు, పీచు రాజిరెడ్డి, కోట రమణారెడ్డి, పూజారి విజయకుమార్, పొరిక విజయ్ కుమార్, కోమాకుల మధుకర్, పడాల రాజు ప్రసాద్, ఎండ్ల భిక్షపతి, సుద్దాల సంపత్, వీసం మహేందర్రెడ్డి తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గడ్డం కేశవమూర్తి, కొత్తగట్టు సుధాకర్ లను బొద్ది రెడ్డి ప్రభాకర్ రెడ్డి తోపాటు షటిల్ కోచ్ లు కూరపాటి రమేష్, మాడిశెట్టి శ్రీధర్, సహచర క్రీడాకారులు వైవి. రాజేందర్, చల్ల రాజు, విక్రం రెడ్డి, గుడి దేవేందర్ రెడ్డి, కట్ల శ్రీనివాస్ అభినందించారు. గోవాలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి మెరిటేరియస్ సర్టిఫికెట్లు సాధించడం పట్ల టీబీఏ అభినందనలు తెలిపారు.

# క్షయ నిర్మూలనకు చర్యలు

◆ కలెక్టర్ పి.ప్రావీణ్య
◆ ఘనంగా క్షయ వ్యాధి దినోత్సవం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** క్షయ వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కాకతీయ మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ జిల్లాలోని ఐదు గ్రామాలను క్షయ వ్యాధి రహిత గ్రామాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనకు గాను డాక్టర్లు సిఫారసు చేసిన ప్రకారం క్రమం తప్పకుండా మందులు నియోగించడంతో పాటు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా వ్యాధిని పూర్తిగా నివారించవచ్చన్నారు. భాగస్వాములు అందరూ సంకల్పంతో కృషి చేయడం, లోపాలను గుర్తించి సరిదిద్దడం, మెరుగైన సేవలు అందించడం ద్వారా 2025 నాటికి టీబి రహిత తెలంగాణ, భారతదేశం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. హనుమకొండ జిల్లాలోని 26 ప్రభుత్వాసుపత్రులను కలుపుకొని సేవలు అందించేందుకు గాను మూడు ట్రీట్మెంట్ యూనిట్స్ గా హనుమకొండ, ముల్కనూరు, పరకాలలో పనిచేస్తున్నాయన్నారు. వ్యాధి నిర్ధారణ, ఫాలో అప్ సేవల కోసం జిల్లాలో ఆరు డిజిగ్నేటెడ్ మైక్రోస్కోపిక్ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. జిల్లా క్షయ నివారణ కేంద్రంలో సిబి నాట్, ట్రూ నాట్ మిషన్స్, వ్యాధి నిర్ధారణ కోసం కాకతీయ వైద్య కళాశాలలో టీబీ కల్చర్ డీఎస్టీ లేబరేటరీ పని చేస్తుందన్నారు. ప్రతి టీబి వ్యాధిగ్రస్తుడు పోషకాహారం తీసుకునేందుకు నెలకు వెయ్యి రూపాయల నగదు, చికిత్స కాలంలో అతని ఖాతాలోకి జమ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఖరీదైనటువంటి మందులు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామన్నారు. 2022లో టీబి కేసుల నమోదు గతంతో పోలిస్తే 40 శాతం తగ్గినందుకుగాను జిల్లాకు సిల్వర్ మెడల్ అందించడం జరిగిందన్నారు. 2024లో టీబీ లక్షణాలు ఉన్న 22,770 మందికి గాను 20,956 (92%) పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. టీబీ వ్యాధి నిర్ధారించిన 1,848 మందికి చికిత్స అందించడం జరిగిందని వెల్లడించారు. హనుమకొండ ట్రీట్మెంట్ యూనిట్ పరిధిలో 1,088, పరకాల ట్రీట్మెంట్ యూనిట్ పరిధిలో 237, ముల్కనూరు పరిధిలో 208 మందికి వైద్య సేవలు అందించినట్లు పేర్కొన్నారు. 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు 363 కేసులు గుర్తించడం జరిగిందన్నారు. డాక్టర్తో పాటు వారి సహాయకులు పూర్తిగా స్వచ్ఛందంగా సేవలు అందించాలని, క్షయ నిర్మూలన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి దినం సందర్భంగా 24 మార్చి సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా ఉదయం 9 గంటలకు భద్రకాళి టెంపుల్ ఆర్చ్ నుంచి కాకతీయ వైద్య కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు స్వచ్ఛందంగా సేవలు అందిస్తామని ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య, వైద్యధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్షయ నివారణకు కృషి చేయాలి

వైద్యాధికారి సరోజ




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ప్రజల నిర్లక్ష్యం కారణంగానే క్షయ వ్యాధి ప్రాణాంతకం అవుతుందని వైద్యాధికారి సరోజ అన్నారు. సోమవారం మార్చి 24న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం కల్పిస్తూ వ్యాధి లక్షణాల గురించి వివరించారు. ఈ సందర్భంగా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవటం, బరువు తగ్గటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్లి తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయ్యిన వారు ప్రభుత్వం ఉచితంగా అందించే చికిత్స క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. వ్యాధి గ్రస్తులకు నిక్షయ్ పోషణ యోజన పథకం కింద ప్రతినెల వెయ్యి రూపాయలు పోషక ఆహారం తీసుకోవటానికి ఉపయోగించుకోవాలన్నారు. ఈ భత్యం చికిత్స పూర్తి కాలం వరకు అందిస్తారని తెలియచేశారు. ఆ తరువాత క్షయ వ్యాధి అంతానికి అందరితో కలిసి పని చేస్తానని ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాలలో కూడా ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ కీర్యా, స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్ ఎస్తేరు, హేమలత, ఫార్మసిస్ట్ లీలరాణి, వైద్య సిబ్బంది సురేందర్, మంజుల, రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

◆ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
◆ మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీఓలు వరంగల్ సత్యపల్ రెడ్డి, నర్సంపేట ఉమరాణిలతో కలసి జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి పలు సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 85 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నేటి ప్రజా వాణిలో అధిక మొత్తంలో రెవెన్యూ శాఖ, కలెక్టరేట్ కి సంబందించిన దరఖాస్తులు వచ్చాయి. అవి రెవెన్యూ శాఖకు 20, కలెక్టరేట్ పరిపాలన విభాగానికి 14 రాగా మిగతా వివిధ శాఖలకు సంబంధించి పలు సమస్యలపై దరఖాస్తులు స్వికరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మండల ప్రత్యేక అధికారులతో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చేపడుతున్న చర్యలు, విద్యుత్ సరఫరా, తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సలహాలు సూచనలు చేశారు. మార్చి 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రైతు ఉత్పత్తి దారుల సంఘం మేళలో సంబంధిత అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులు వివిధ శాఖల వారీగా 974 రాగా వాటిలో 65 మాత్రమే పరిష్కరించడం జరిగిందని మిగతా దరఖాస్తులను పరిష్కరించే విలున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించి, వీలు లేని దరఖాస్తులను ఎందుకు పరిష్కరించలేదో దరఖాస్తు దారుడికి వివరించే ప్రయత్నం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఆర్డీఓ కౌసల్య దేవి, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం..

జిల్లా కలెక్టరేట్ సమావేశపు హాలులో సోమవారం మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో డీసీపీ సెంట్రల్ జోన్ అంకిత్ కుమార్, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com